గిరిజన రైతులకు వరం జల్లేరు జలాశయం


జల్లేరు జలాశయం పంట కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు


జల్లేరు జలాశయం నీటితో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట


ప్రస్తుతం నిండుగా ఉన్న జలాశయం

- ఈ ఏడాది సుమారు 1,000 ఎకరాల్లో రబీకి సాగునీరు
- నీరు సమృద్ధిగా అందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు సన్న, చిన్నకారు రైతులకు రబీ పంటల సాగుకు ఉపయోగపడుతుంది. దీంతో ఈ జలాశయం గిరిజన రైతుల పాలిట వరంగా మారింది. ఈ ప్రాంతంలో అలివేరు డ్యామ్ కాలనీ, చిన్న జీడిపూడి, పెద్ద జీడిపూడి, గుర్రప్పగూడెం, గుబ్బిన మామిడి, దొరమామిడి, తెల్లంవారిగూడెం, ముప్పినవారిగూడెంతో పాటు జలాశయంపై గ్రామాలైన లంకపాకల, ఎర్రాయిగూడెం, కొత్త అలివేరు, పాత అలివేరు, తదితర గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులు పూర్తి వర్షాధారంపైనే పంటలు పండిస్తుంటారు.

రబీకి జలాశయం నీరే ఆధారం

అయితే ఖరీఫ్ సీజన్‌కు వర్షాధారంపైనే పంటలు పండిస్తున్నా రబీ సీజన్ సమయంలో జల్లేరు జలాశయం నీరే పూర్తిగా ఆధారం. ఆయా ప్రాంతాల్లోని గ్రామాల గిరిజన రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతోనే ఈ గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 217.08 మీటర్ల నీటి మట్టం. అయితే ఈ ఏడాది నవంబర్, డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు సామర్థ్యానికి మించి ప్రాజెక్టులో నీరు వచ్చి చేరింది. అయితే సుమారు 200 క్యూసెక్ మీటర్ల వరకూ నీటిని ఇరిగేషన్ అధికారులు బయటకు విడుదల చేసి ప్రాజెక్టు సామర్థ్యం వరకూ నీరు ఉంచారు. రబీ సీజన్ ప్రారంభం కాగానే అక్టోబర్‌లో పంట కాలువ ద్వారా నీరు విడుదల చేయడంతో ఈ ఏడాది సుమారు 1,000 ఎకరాల వరకూ రైతులు వరి, మొక్కజొన్న, చెరకు, మిర్చి, పొగాకు, అపరాలు వంటి పంటలను సాగు చేసుకుంటున్నారు. నీరు పుష్కలంగా అందడంతో పచ్చదనంతో పంటలు కళకళలాడుతున్నాయి. ఉదయం లేచిన వెంటనే రైతులు పొలానికి వెళ్లి పంట కాలువ ద్వారా వచ్చిన నీటిని వారి చేలకు మలుచుకుని పంటలు పండిస్తూ ఆనందంగా కనిపిస్తున్నారు.

జల్లేరు జలాశయం మాకు వరం

జల్లేరు జలాశయం మాకు వరంలా మారింది. పూర్తిగా వర్షాధారం మీదే పంటలు పండించే మాకు రబీ సీజన్‌లో పంటలు పండించుకునేందుకు జల్లేరు జలాశయం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం నేను ఎనిమిది ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. కావాల్సినంత నీరు అందుతుంది.

–మిడియం సోమరాజు, గిరిజన రైతు, జీడిపూడి, బుట్టాయగూడెం మండలం

10 ఎకరాల్లో పొగాకు పంట వేశాను



నేను రబీ సీజన్‌లో పది ఎకరాల్లో వర్జీనియ పొగాకు పంట వేశాను. జల్లేరు జలాశయం నుంచి విడుదలవుతున్న నీరే మా పంటలకు ఆధారమైంది. వంతులవారీగా నీటిని రైతులు ఉపయోగించుకుంటున్నాం.

–తెల్లం రాముడు, గిరిజన రైతు, జీడిపూడి, బుట్టాయగూడెం మండలం

రబీ పంటలు బాగా వేశారు



జల్లేరు జలాశయం ప్రాజెక్టు దిగువ, ఎగువ ప్రాంతాల్లో రైతులు 1000 ఎకరాలకు పైగా పంటలు వేశారు. మొక్కజొన్న అత్యధికంగా వేశారు. వరి, చెరకు, పొగాకు, అపరాల సాగు చేస్తున్నారు. జలాశయం నీటి ద్వారా రైతులకు సాగునీరు సమృద్ధిగా అందుతుంది.

–డి.ముత్యాలరావు, ఏఈ, బుట్టాయగూడెం మండలం

నేడు విద్యుత్తు నిలిపివేత

కొయ్యగూడెం: బోడిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు డీఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. లైన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ నిర్వహిస్తున్నందున కొయ్యలగూడెం మండలంలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కామవరపుకోట: మండలంలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో లక్కవరం, ఉప్పలపాడు, యడవల్లి, అంకాలంపాడు, తడికలపూడి గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కుక్కునూరు: సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ రాత్రి పన్నెండు నుంచి ఉదయంఎనిమిది గంటల వరకు ఇస్తామన్నారు.

జంగారెడ్డిగూడెం: తాడువాయి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వేళల్లో మార్పులు చేసినట్లు తెలిపారు. చల్లవారిగూడెం, గొల్లగూడెం, ఎ.పోలవరం, జొన్నవారిగూడెం, మంగిశెట్టిగూడెం గ్రామాలకు ఉదయం మూడు నుంచి పదకొండు గంటల వరకు వ్యవసాయ కరెంటు ఉంటుందన్నారు. అలాగే రెండో గ్రూపు ఉదయం పదకొండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు చిన్నవారిగూడెం, మాతన్నగూడెం గ్రామాలకు త్రీఫేస్ కరెంటు ఉంటుందన్నారు.

చింతలపూడి: లింగపాలెం, టి.నర్సాపురం ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పట్టాయిగూడెం సబ్‌స్టేషన్, సీతానగరం ఫీడర్, రేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్‌కు రివార్డు


ఎస్పీ కేపీఎస్ కిషోర్ చేతుల మీదుగా రివార్డును అందుకుంటున్న కానిస్టేబుల్

జంగారెడ్డిగూడెం: చోరీకి గురైన ఫోన్ల రికవరీలో ముందున్న జంగారెడ్డిగూడెం పోలీస్ కానిస్టేబుల్ రివార్డును అందుకున్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న షానుబాబు మిస్సింగ్ మొబైల్స్ రికవరీలో ప్రతిభ చూపారు. 20 రోజుల్లో 24 సెల్‌ఫోన్లు రికవరీ చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా షాన్‌బాబు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రివార్డును అందుకున్నారు. రివార్డు అందుకున్న షాన్‌బాబును డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్ అభినందించారు.

మృత్యువాత పడుతున్న నాటు కోళ్లు

కుక్కునూరు: మండల కేంద్రంలో పలుచోట్ల నాటు కోళ్లు మృత్యువాత పడుతుండడం గ్రామస్తులను కలవరపెడుతుంది. తిరుగుతూ, తిరుగుతూనే కోళ్లు అర గంటలో మృతి చెందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కుక్కునూరు సీఎం కాలనీ, సంజయ్‌నగర్, పెట్రోల్ బంక్ ఏరియాకు చెందిన కోళ్లు మృతి చెందాయని యజమానులు తెలిపారు. కాగా తెలుగు రాష్ట్రాల్లో బర్డ్‌ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయనే అనుమానాలు తెలెత్తుతున్నాయి. ఈ విషయం పట్టించుకునేందుకు వెటర్నరీ డాక్టర్ లేకపోవడం విమర్శలకు తావిస్తుంది.

వెటర్నరీ శాఖ నిర్లక్ష్యం

కుక్కునూరు వెటర్నరీ వైద్యశాలలో డాక్టర్‌ను ప్రభుత్వం నియమించలేదు. ఇక్కడి పాడి రైతులు డాక్టర్ లేక ఇబ్బందులు పడుతున్నా ఆ శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్‌చార్జి డాక్టర్లను కేటాయించినప్పటికీ పేరుకు మాత్రమేనని స్థానికులు అంటున్నారు. వారు ఏ రోజూ కుక్కునూరు వచ్చింది లేదు వైద్యసేవలు అందించింది లేదు. ఇప్పుడు కోళ్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ఆ శాఖాధికారులు ఇకనైనా స్పందిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందేనని పలువురు చెబుతున్నారు.

పేకాటపై దాడి


జంగారెడ్డిగూడెం: స్థానిక పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. స్థానిక మార్కండేయపురం గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో ఎస్సై షేక్ జబీర్ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 11 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,38,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం


ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్

లింగపాలెం: గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయాన్ని అందించాలని జి.విజయసుందర్ ప్రచారం నిర్వహించారు. గురువారం లింగపాలెం మండలంలోని ఉన్నత పాఠశాలలను సందర్శించి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేయుచున్న తనకు ఓటు వేయమని అభ్యర్థించారు. ఈ సందర్భంగా విజయ్‌సుందర్ మాట్లాడుతూ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా పరిశ్రమలు విద్యా సంస్థల మధ్య వారిధిగా నిలిచి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తానన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు సకాలంలో అందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా సుందర్ పేర్కొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన


సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గణపవరం: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంతో సబ్సిడీపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవచ్చునని ఎంపీడీఓ బీవీ శ్రీలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల కార్యాలయంలో సూర్యగర్ యోజనపై అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్‌తో డబ్బు ఆదాతోపాటు, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో పాటు, బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. డీఈఈ, ఏఈ, డీఆర్‌డీఏ ఏపీఎం, కార్యదర్శులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

గణపవరం: గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌లో ప్రధానమంత్రి సురక్షిత మా తృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 75 మంది గర్భిణులకు కిరణ్మయి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రమే పురుడు పోసుకోవాలని సూచించారు. ఐరన్ మాత్రలు, కాల్షియం టాబ్లెట్లు వాడాలన్నారు. సీహెచ్‌ఓ జాలాది విల్సన్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పర్యటన


వైఎస్సార్‌సీపీ నాయకులు రాధయ్యతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు యాండ్రప్రగడ రాధయ్య ఇంటికి వెళ్లి కొద్దిసేపు ఆయనతో ముచ్చటించారు. అదే విధంగా ఆయన ఆరోగ్య స్థితిగతులను కూడా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామానికి చెందిన యాండ్రప్రగడ భూసియ్య సతీమణి శ్యామలావతి ఇటీవల మృతి చెందారు. అక్కడికి కూడా వెళ్లి శ్యామలావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు కలగర నాని, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్డు మరమ్మతులు


రోడ్డు మరమ్మతులు చేపట్టిన ఆర్‌అండ్‌బీ అధికారులు

పోలవరం రూరల్: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టిసీమ నుంచి పోలవరం కార్మల్‌పురంలోని ప్రభుత్వ కార్యాలయాల వరకు రోడ్డు ప్యాచ్ వర్కులను ఆర్అండ్‌బీ అధికారులు చేపట్టారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా గుంతలు పడిన రోడ్డును మరమ్మతులు చేపట్టాలని ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ ఇచ్చిన ఆదేశాల మేరకు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. అలాగే రోడ్డుకు ఒక వైపు ఉన్న జంగిల్ క్లీనింగ్ పనులను ఆర్అండ్‌బీ అధికారులు, మరో వైపు ఏజీఆర్‌బీ అధికారులు జంగిల్ క్లీనింగ్ పనులు చేపట్టారు. ఉత్సవాల సమయంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు మార్గాన్ని సరిచేసే పనులు చేపట్టారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు విజయకృష్ణ

కామవరపుకోట: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథక అమలతీరును ఆయన పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. సరుకు నిల్వలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ఆహారాన్ని నాణ్యతతో, శుభ్రతతో విద్యార్థులకు అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఆహార నాణ్యత, నీటి పరిశుభ్రత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తే వారు ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉంటారని చదువులో రాణిస్తారనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని సద్వినియోగపరుచుకుని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. విద్యార్థులు అక్కడున్న సమస్యలు తెలిపారని అన్ని వివరాలతో నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు పంపుతానన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో బ్యూల

జంగారెడ్డిగూడెం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషణ్‌బీ–పడాయ్‌బీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక బాలుర, బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాథమిక శిక్షణ, చిన్నారుల అభివృద్ధి, ఆరు రకాల డొమైన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో పి.బ్యూలా మాట్లాడుతూ పోషణ్‌బీ, పడాయ్‌బీ అనే కార్యక్రమం ద్వారా చిన్నారుల అభివృద్ధి, సంరక్షణ, పోషణపై పర్యవేక్షిస్తారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమంపై అవగాహన పెంచుకుని గృహ సందర్శన ద్వారా తల్లులను చైతన్య పరచాలన్నారు. శారీరక, మానసిక, సాంఘిక, భాష, గణిత, సృజనాత్మకత వంటి ఆరు రకాల డొమైన్లను వివరించి, అమలు చేసి, చిన్నారుల అభివృద్ధికి కృషి చేయాలని అంగన్‌వాడీలకు సూచించారు. తొలి రోజు ట్రైనింగ్‌లో ఐదు రకాల గ్రూపులుగా చార్టుల మీద ప్రదర్శించి, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా క్షేత్ర స్థాయిలో అర్థమయ్యే రీతిలో వివరించామని సీడీపీవో తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

పెదవేగి : మత్తు పదార్థాలు, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ ప్రజలకు సూచించారు. ఓరల్, మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ శనివారపేట నుంచి దుగ్గిరాల దంత వైద్య కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగం హెచ్‌డీ వీఆర్ చంద్రబాబు, కరస్పాండెంట్, సెక్రటరీ జి.మోజెస్, ప్రిన్సిపాల్ ఎన్ స్లీవరాజు, డాక్టర్లు ప్రవీణ్, శ్రీకాంత్, గౌత, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి


రైతుల నుంచి భూమి వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు

పోలవరం రూరల్: మండలంలోని భూమి కలిగిన ప్రతీ రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు తెలిపారు. గురువారం పోలవరం రైతు సేవాకేంద్రంలో విశిష్ట సంఖ్య ఆవశ్యకతను తెలుపుతూ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రైతుసేవా కేంద్రాల్లో సొంత భూమి గల రైతులకు ఆధార్ తరహాలో ఒక యూనిక్ ఐడీ క్రియేట్ చేస్తారన్నారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆధార్‌కార్డు, పొలానికి సంబంధించిన సర్వే నంబర్లు, ఆధార్ లింక్ అయిన మొబైల్ తీసుకెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుల నుంచి భూమి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన వలన ఉపయోగాలు

- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీ పంట రుణాలు, బీమా వంటి నగదు నేరుగా ఇచ్చే పథకాలకు యూనిక్ ఐడీ తప్పనిసరి.
- వ్యవసాయ యాంత్రీకరణ, రాయితీపై ఇచ్చే విత్తనాలు, జింకు, జిప్సం వంటి సూక్ష్మ పోషకాల సరఫరా, తదితర పరోక్ష పథకాలకు రాయితీ పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవలెను.
- ఈ పంట నమోదు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సొసైటీలో ఎరువుల సరఫరా తదితర వాటికి తప్పనిసరిగా యూనిక్ ఐడీ ఉండాలి.
- రైతులను ఒక డేటా బేస్ కిందకి తీసుకొచ్చి క్రయ విక్రయాలు సులువుగా ఉండే విధంగా దూర ప్రాంతాల్లో విక్రయించుకునే విధంగా ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ రూపొందించారు.
- కావున రైతులు క్రమం తప్పకుండా మీకు సంబంధించిన రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి యూనిక్ ఐడీ క్రియేట్ చేసుకోవాల్సిందిగా మండలంలోని రైతులను వ్యవసాయశాఖ అధికారి కోరారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


చింతలపూడి: నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు


పోలవరం రూరల్: మహిళను అరెస్టు చేసిన దృశ్యం

చింతలపూడి: స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతలపూడి మండలం, పంతంగలగూడెం గ్రామంలో సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. పంతంగలగూడెం గ్రామానికి చెందిన ఇస్లావతు తాతారావును సారా తయారు చేస్తుండగా బట్టీ వద్ద పట్టుకుని, పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అరెస్ట్

పోలవరం రూరల్: పోలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా సారాను కలిగి ఉన్న మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. పోలవరం గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన మల్లి గంగ ఐదు లీటర్ల సారా కలిగి ఉండటంతో ఆమెను అరెస్టు చేసి సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై జి.సునీల్‌కుమార్, సిబ్బంది పి.సునీల్‌కుమార్, పి.రమ్యదుర్గ, కె.సత్యనారాయణ, బి.వెంకన్నబాబు పాల్గొన్నారు.

ఆదివాసీలపై మారణకాండ ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్ముల సురేష్

జంగారెడ్డిగూడెం: ఆదివాసీలపై జరుపుతున్న మారణకాండ వెంటనే ఆపాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సెక్రెటేరియట్ సభ్యులు దర్ముల సురేష్ డిమాండ్ చేశారు. కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని ఆదివాసీలపై దాడులను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ జంగారెడ్డిగూడెంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సురేష్ మాట్లాడుతూ దేశ ప్రజల ఆస్తులైన అడవులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కేంద్ర విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజా సంఘాల పిలుపు మేరకు నిరసన సభ నిర్వహించినట్లు చెప్పారు. భారత ప్రజల సంపద అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి నక్సలైట్ల బూచి చూపి ఆదివాసీలపై సైన్యంతో దాడులు చేస్తున్నారన్నారు. భారత ప్రజలపై భారత సైన్యం దాడులు చేయించే వైఖరిని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణ రాజు, పీవైఎల్ నాయకులు తగరం బాబురావు, కె.పోతిరెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు బన్నే వినోద్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు నడపల ముక్కరెడ్డి, వి.సద్గురు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రవచనం, హరికథా కాలక్షేపం


ప్రవచనం చేస్తున్న వద్దిపర్తి పద్మాకర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌనధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్యహోమం, నిత్యకల్యాణం నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన త్రిభాషా మహా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి నగరానికి చెందిన సప్పా భారతి బాగవతారిణి నర్తనశాల అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. అర్చకులు దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ పూజలు చేయగా, విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యతోనే అభివృద్ధి

దెందులూరు : విద్యతోనే అభివృద్ధి అవగాహన ముడిపడి ఉందని ఆకుల నరసింహారావు ఉమాలక్ష్మి ట్రస్ట్ అధినేత ఎన్ఆర్ఐ ఆకుల శ్రీధర్ అన్నారు. గురువారం దెందులూరు ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఎస్ అపర్ణకు రూ.2000, వై.లావణ్యకు రూ.1500 అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి సంపెంగ వెంకట లక్ష్మి, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎం వెంకటాద్రి, గ్రంథ పాలకులు గుల్లపూడి వెంకటేశ్వరరావు ఉన్నారు.